ప్రజాశక్తి
శనివారం 23 మార్చి 2024 5 అనంతపురం

హిందూపురం ఎంపీ అభ్యర్థిగా 'బికె'

ప్రజాశక్తి-అనంతపురం

టిడిపి హిందూపురం పార్లమెంట్ అభ్యర్థిగా బికె.పార్థసారథిని ఆ పారీట అధిష్టానం ఖరారు చేసింది. బికె.పార్థసారథి గతంలోనూ పార్లమెంట్ సభ్యుడిగా పనిచేశారు. 1999లో ఆయన హిందూపురం పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆ తరువాత 2004లో ఇదే స్థానం నుంచి ఎంపీగా పోటీ చేసి ఓటమి చెందారు. ఆ తరువాత నుంచి ఆయన పెనుకొండ అసెంబ్లీ నుంచి పోటీ చేస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో అసెంబ్లీ స్థానం నుంచి తప్పించి తిరిగి పార్లమెంటు బరిలో దింపేందుకు టిడిపి సిద్ధమైంది. కురుబ సామాజిక తరగతి అధికంగానున్న ఈ ప్రాంతంలో ఈయనకు టికెట్టు ఇవ్వడం ద్వారా ప్రయోజనం చేకూరుతుందని టిడిపి భావిస్తోంది.

యువనేతల పయనమెటు..?

◆ జెసి.పవన్, పరిటాల శ్రీరామ్‌కు అవకాశం లేనట్టేనా..! ◆ పోటీకి ఖరారవ్వని స్థానాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఒకప్పుడు అనంతపురం జిల్లా రాజకీయాలను శాసించిన కుటుంబాలు. ఒకరు కాంగ్రెస్ తరుపున అయితే.. మరొకరు టిడిపి తరుపున జిల్లా రాజకీయాల్లో తమదైన ముద్రను వేశారు. ప్రస్తుతం ఆ ఇద్దరు నేతల కుమారుల రాజకీయ పయనమెటు అన్నది ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.



జెసి.దివాకర్‌రెడ్డి



జెసి.పవన్‌కుమార్‌రెడ్డి

జెసి.దివాకర్‌రెడ్డి.. జిల్లాలో ఒకప్పుడు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు. కాంగ్రెస్ పార్టీలో 1983 నుంచి 2019 వరకు సీనియర్ రాజకీయ నాయకుడిగా ఆయనకు ప్రత్యేకమైన స్థానముంది. 2014లో రాష్ట్ర విభజన ముందు వరకు కాంగ్రెస్ పార్టీలో ఆయన ఉన్నారు. ఆరుసార్లు వరుసగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. మంత్రి పదవులూ చేపట్టారు. 2014లో రాష్ట్ర విభజన తరువాత కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశంలో చేరారు. అనంతపురం పార్లమెంట్ సభ్యుడిగా గెలుపొందారు. ఓటమన్నది ఎరుగకుండా విజయం సాధిస్తూ వచ్చారు. 2019లో వయసు రిత్యా ఆయన ఎన్నికల బరిలో నుంచి తప్పుకుని ఆయన కుమారుడు జెసి.పవన్‌కుమార్‌రెడ్డికి అవకాశం కల్పించారు. పవన్‌కుమార్ రెడ్డి ఎదుర్కొన్న తొలి ఎన్నికలోనే ఓటమిని చవిచూశారు. ఆ తరువాత కొంత కాలంలో రాజకీయంగా క్రియాశీలకంగా ఉన్నారు. గడిచిన రెండేళ్లుగా రాజకీయ కార్యకలాపాల్లో చాలా తక్కువగానే పాల్గొంటూ వస్తున్నారు. ఇక ఈ ఎన్నికల్లోనైనా చురుగ్గా పాల్గొని ఏదోక స్థానం నుంచి బరిలో నిలుస్తారని అందరూ భావించారు. తెలుగుదేశం పార్టీ ఇప్పటికే టిక్కెట్లను ఖరారు చేసింది. అనంతపురం పార్లమెంటు, అనంతపురం అర్బన్, గుంతకల్లు నియోజక వర్గాలకు మాత్రమే అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఈ మూడింటిలోనూ ఏ మేరకు ఆయనకు అవకాశం లభిస్తుందన్న దానిపై సందేహాలైతే నెలకొన్నాయి. టిక్కెట్టు లేకపోతే ఆయన రాజకీయ భవితవ్యం ఏ రకంగా ఉండనుందన్నది రాజకీయవర్గాల్లో నడుస్తున్న చర్చ.

పరిటాల రవీంద్ర

పరిటాల శ్రీరామ్

పరిటాల రవీంద్ర.... ఉమ్మడి అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీలో పరిటాల రవీంద్ర పేరు ప్రముఖంగా విన్పిస్తుంది. జిల్లాలోనే కాకుండా ఈయన రాష్ట్ర స్థాయి రాజకీయాల్లోనూ తన ప్రత్యేకతను చాటుకున్నారు. 1991లో నక్సల్‌బరీ ఉద్యమం నుంచి బయటకొచ్చి తెలుగుదేశం పార్టీలో చేరారు. 90వ దశకమంతా జిల్లా రాజకీయ చరిత్రలో ఈయన హవానే కొనసాగింది. జిల్లా రాజకీయాలను ఒక రకంగా ఆయన శాసించారనే చెప్పాలి. 2005లో ఆయన మృతి తరువాత ఆయన సతీమణి పరిటాల సునీత రాజకీయాల్లోకి వచ్చారు. 2019 ఎన్నికల్లో ఆమె తప్పుకుని కుమారుడు పరిటాల శ్రీరామ్‌ను రాప్తాడు అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయించారు. ఈ ఎన్నికల్లో శ్రీరామ్ ఓటమి పాలయ్యారు. ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉంటూ వచ్చారు. ధర్మవరం నియోజకవర్గంలో 2019 ఎన్నికల అనంతరం అక్కడి నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన గోనుగుంట్ల సూర్యనారాయణ బిజెపిలోకి వెళ్లారు. ఆయన బిజెపిలోకి వెళ్లగానే టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ధర్మవరం నియోజకవర్గం బాధ్యతలను పరిటాల శ్రీరామ్‌కు అప్పగించారు. అప్పటి నుంచి శ్రీరామ్ ధర్మవరం టిడిపిని ముందుండి నడిపించారు. ఇప్పుడు కూడా నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా శ్రీరామ్ ఉన్నారు. కాగా పొత్తుల్లో భాగంగా ఆ స్థానాన్ని బిజెపికి కేటాయించారు. దీంతో పరిటాల శ్రీరామ్‌కు పోటీ చేసే అవకాశం లేకుండాపోయింది. ముందు పోటీచేసిన రాప్తాడు స్థానంలో పరిటాల సునీత పేరును ఇప్పటికే టిడిపి అధిష్టానం ప్రకటించింది. ఈ పరిస్థితుల్లో శ్రీరామ్‌కు ఎక్కడి నుంచి పోటీ చేసే అవకాశం లేకుండాపోయింది. ధర్మవరం టిక్కెట్టు ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు ఒకవైపు నిరసనలు కొనసాగిస్తూనే ఉన్నారు. అయితే అధిష్టానం నిర్ణయంలో ఎటువంటి మార్పు కనిపించడం లేదు. ఈ క్రమంలో పరిటాల శ్రీరామ్ రాజకీయ పయనం ఏ రకంగా ఉంటుందన్న చర్చ నడుస్తోంది.

ఎన్నికల నియమావళి వందశాతం అమలు

కలెక్టర్ ఎం.గౌతమి

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం

ఎన్నికల కమిషన్ సూచనల మేరకు సాధారణ ఎన్నికలు- 2024 దృష్ట్యా జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పూర్తిస్థాయిలో అమలు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.గౌతమి తెలియజేశారు. శుక్రవారం నాడు కలెక్టరేట్ నుంచి ఎన్నికల నియమావళి అమలు, ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై జిల్లా, మండల స్థాయి ఎన్నికల అధికారులతో టెలీ కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు చేయడాన్ని అధికారులు బాధ్యతగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో రాజకీయ పార్టీల హోర్డింగ్స్, పోస్టర్లు, బ్యానర్లు, ఫొటోలు, లోగోలు ఉండడానికి వీలు లేదన్నారు. ప్రయివేటు భవనాలపై వాల్ రైటింగ్స్, ఫ్లెక్సీలు, బ్యానర్లు ఉండరాదన్నారు. రిటర్నింగ్ అధికారులు, ఎంసిసి టీమ్స్ ఎంసిసి అమలుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సంబంధిత అధికారులు ఎంసీసీ అమలుపై ప్రతిరోజూ పరిశీలన చేస్తూ ఉండాలన్నారు. ప్రభుత్వంలో పని చేస్తున్న ఎవరు కూడా రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొనరాదన్నారు. వాలంటీర్లు రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీజర్స్‌కు సంబంధించి ప్రతిరోజూ రిపోర్టులు అందించాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వరకు ఎంసీసీ ఫిర్యాదులు వస్తుంటాయని, ఫిర్యాదులను సకాలంలో పరిష్కారానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, జిల్లా పరిషత్ సిఇఒ వైఖోమ్ నిదియా దేవి, డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డితో ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నాం: కలెక్టర్

జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.గౌతమి తెలియజేశారు. విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫిరెన్స్‌ను శుక్రవారం నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, జిల్లా పరిషత్ సిఇఒ వైఖోమ్ నిదియా దేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై క్షేత్రస్థాయిలో నిత్యం పరిశీలన చేస్తున్నామని చెప్పారు. ఎక్కడా ఎంసిసి ఉల్లంఘన జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు కరుణకుమారి, వెన్నెల శీను, నోడల్ అధికారులు భాస్కర్, ఉమామహేశ్వరమ్మ, ఎంసిఎంసి మెంబర్ సెక్రెటరీ పి.గురుస్వామిశెట్టి, డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్, ఎన్ఐసి డిలో రవిశంకర్, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, పాల్గొన్నారు.

శింగనమల వైసిపి అసమ్మతి నేతల సమావేశం

ప్రజాశక్తి-నార్పల

నియోజకవర్గ వైసిపి అసమ్మతివర్గ నేతలు మరోసారి సమావేశమై తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారు. శుక్రవారం అనంతపురంలోని గుత్తి రోడ్డులో ఉన్న తిరుమల టాక్టర్స్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వైసిపి ప్రకటించిన వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులుకు తాము వ్యతిరేకం కాదన్నారు. అయితే ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చకపోతే తాము సహకరించేది లేదన్నారు. అభ్యర్థిని మార్చితే భారీ మెజారిటీతో గెలిపించి జగన్‌కు బహమతి ఇస్తామని వివరించారు. ఈ సమావేశంలో వైసిపి అసమ్మతి నేతలు నార్పల సత్యనారాయణరెడ్డి, చెన్నంపల్లి రాజన్న, గార్లదిన్నె నారాయణరెడ్డి, చాములూరు రాజాగోపాల్, మిద్దె కుళ్లాయప్ప, తరిమెళ గోకుల్‌రెడ్డి, దుర్గం సర్పంచి రామాంజి, బుక్కరాయసముద్రం ఎంపిపి సునీత భర్త నారాయణస్వామి, మాజీ జడ్పిటిసి రామకృష్ణ, శింగనమల మాజీ మండల కన్వీనర్ పట్నం నగేష్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రూ. 1.5 లక్షల నగదు స్వాధీనం

రాయదుర్గం : పట్టణ పోలిమేరలోని పైతోట గాలి మారెమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద శుక్రవారం పోలీసులు రూ. 1.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు.. చెక్‌పోస్టు వద్ద పోలీసులు మధ్యాహ్నం 3 గంటల సమయంలో వాహనాలు తని ఖీ చేస్తుండగా ఓ వ్యక్తి వద్ద రూ. 1,50,000 నగదును గుర్తించారు. బొమ్మనహాల్ మండలంలోని ఉంతకల్లు గ్రామానికి చెందిన కురుబ పాండు ఎలాంటి ఆధారాలు లేకుండా రూ. 1.5 లక్షల నగదు తీసుకెళు ండగా పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద ఉన్న నగదును సీజ్ చేసినట్లు సిఐ తెలిపారు.

పారిశుధ్యం నిర్వహణకు ప్రజలు సహకరించాలి

కమిషనర్ మేఘస్వరూప్

కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ మేఘస్వరూప్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు నిర్వహిస్తున్న ఇంటింటి చెత్త సేకరణకు ప్రజలంతా సహకరించాలని కమిషనర్ మేఘస్వరూప్ కోరారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థలోని 3వ సర్కిల్ మస్టర్ పాయింట్‌ను కమిషనర్ తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సర్కిల్ పరిధిలోని శానిటేషన్ సిబ్బంది హాజరును పరిశీలించారు. అనంతరం కార్మికులతో మాట్లాడుతూ కార్మికులు కష్టపడి కాకుండా, ఇష్టపడి పని చేయాలన్నారు. ముఖ్యంగా కార్మికులకు సకాలంలో వారికి రావాల్సిన పనిముట్లతో సహా, చేతి తొడుగులు, బూట్లు, ఖచ్చితంగా కార్మికులందరూ ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం సాయినగర్, అశోక్‌నగర్, గుల్జార్‌పేట, లక్ష్మీనగర్, తదితర ప్రాంతాల్లో చెత్త సేకరణ పనులను పర్యవేక్షించారు.

ముగ్గురు వాలంటీర్ల తొలగింపు

అనంతపురం కార్పొరేషన్ : నగరపరిధిలో ప్రజాప్రతినిధులతో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ముగ్గురు వార్డు వాలంటీర్లను తొలగిస్తూ కమిషనర్ వై.మేఘస్వరూప్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాలంటీర్లు రాజకీయ ప్రచారాల్లో పాల్గొనరాదన్నారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన వాలంటీర్లు ఎస్.అబ్బాస్, డి.మహమ్మద్‌రఫీ, బి.కుళ్లాయమ్మను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

పోరాటయోధుడు అప్పారి వెంకటస్వామి

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప

వెంకటస్వామికి నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణంలో అలుపెరుగని పోరాటం చేసిన ఉద్యమ నాయకుడు అప్పారి వెంకటస్వామి అని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య అన్నారు. శుక్రవారం యుటిఎఫ్ భవన్‌లో అప్పారి వెంకటస్వామి 24వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగంలోనూ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలోను ఆనాటి ప్రభుత్వాల నిరంకుశ విధానాలను ఎండగట్టడానికి చారిత్రాత్మకవసరంగా యుటిఎఫ్ ఆవిర్భావం జరిగిందన్నారు. ఆవిర్భావ ప్రధాన కార్యదర్శిగా అప్పారి రాజీలేని సమరశీల పోరాటాలు నడుపుతూ 25 సంవత్సరాల పైబడి సంఘానికి తన జీవితాన్ని సమర్పించి సంఘం కోసం తన ఉద్యోగ జీవితాన్ని సైతం తణప్రాయంగా వదిలివేసిన త్యాగధనుడు అప్పారి వెంకటస్వామి అని కొనియాడారు. అప్పారి వెంకటస్వామి ముందుచూపు, దార్శనికత, సంఘం పట్ల నిబద్ధత, అవినీతిపై రాజీలేని పోరాటాలు, ఉద్యమ స్ఫూర్తి అనేక సమస్యలకు పరిష్కారాలయ్యాని తెలిపారు. అప్పారి చూపిన ఆదర్శ మార్గంలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు, వివిధ మండలాల నాయకులు చంద్రమోహన్, సంపత్ కుమార్, వెంకట్ నాయుడు, గంగాధర్, నాగేంద్ర, శ్రీరాములు, చంద్రశేఖర్, శివ రుద్రప్ప, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షకు 3274 మంది గైర్హాజరు

అనంతపురం సిటీ : జిల్లాలో శుక్రవారం నిర్వహించిన పదవ తరగతి గణితం పరీక్షకు 3274 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి బి.వరలక్ష్మి తెలిపారు. రెగ్యులర్, ప్రయివేట్ కలిపి 37,293 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 3274 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

జెఎన్‌టియు బీ ఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం : జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన బీ.ఫార్మసీ 3వ సంవత్సరం 1వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, 3వ సంవత్సరం 1వ సెమిస్టర్ సప్లిమెంటరీ, 3వ సంవత్సరం 2వ సెమిస్టర్ (ఆర్19), (ఆర్15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఇ.కేశవరెడ్డి , కంట్రోలర్ అఫ్ ఎక్జామినేషన్ బి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఫలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ www.jntua.ac.inను సంప్రదించాలని కోరారు.

ఎర్రగుంట్లలో కిరాతకం..!

◆ తీసుకున్న బంగారు నగలు తిరిగి ఇమ్మన్నందుకు చంపేశారు..!

◆ వృద్ధురాలి దారుణ హత్య

◆ శరీరాన్ని ముక్కలుగా కోసి నదిలో పడేసిన దుర్మార్గులు

గార్లదిన్నె మండలంలో అత్యంత కిరాతక ఘటన చోటు చేసుకుంది. పెళ్లిలో వేసుకునేందుకు తీసుకున్న తన బంగారు నగలు ఇచ్చేయాలని కోరినందుకు వృద్ధురాలిని అత్యంత దారుణంగా హత్య చేశారు. శరీరాన్ని ముక్కలు ముక్కలు చేసి భాగాలను పెన్నానదిలో పడేశారు. సభ్యసమాజం నిర్ఘాంతపోయేలా వ్యవహరించి వారి క్రూరత్వాన్ని చాటుకున్నారు. అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం ఎర్రగుంట్ల గ్రామంలో శుక్రవారం వెలుగుచూసిన ఈ ఘటన తీవ్ర సంచలనం రేపింది. ఇందుకు సంబంధించిన వివరాలను అనంతపురం డీఎస్పీ వెంకటశివారెడ్డి, సిఐ శ్రీధర్, ఎస్ఐ గౌస్‌లు విలేకరులకు వెల్లడించారు.

హత్యకు గురైన వృద్ధురాలు ఓబుళమ్మ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-గార్లదిన్నె

గార్లదిన్నె మండల పరిధిలోని ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన ఓబుళమ్మ(85)కు ఎవరూ లేరు. భర్త మరణించగా ఒక్కతే ఉంటోంది. తన తమ్ముడు శివ శంకర్‌రెడ్డి వ్యవసాయ పొలంలో కూలీలతో పనులు చేయిస్తూ సాయంగా ఉండేది. వీరి పొలం పక్కనే పొలాన్ని కౌలుకు తీసుకుని బీరే కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు పంటలు సాగు చేసుకునేవారు. ఈ క్రమంలో ఫిబ్రవరి 7వ తేదీన శుభకార్యానికి బంగారు నగలు అవసరం అని, రెండు రోజుల్లో వాటిని తిరిగి ఇచ్చేస్తామని చెప్పి ఓబుళమ్మతో ఏడు తులాల బంగారు నగలను బీరే కృష్ణమూర్తి తీసుకెళ్లారు. 50 రోజులు అవుతున్నా కృష్ణమూర్తి బంగారు నగలను వెనక్కు ఇవ్వలేదు. పలుమార్లు ఓబుళమ్మ నగలు ఇవ్వాలని కోరినా ఏదోఒకటి చెప్పి తప్పించుకుని తిరిగేవాడు. కాగా కృష్ణమూర్తి వృద్ధురాలితో తీసుకున్న బంగారు నగలను అనంతపురం లోని ఒక ప్రయివేటు బ్యాంకులో తాకట్టు పెట్టి రూ.2.80 లక్షలకు డబ్బులు తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం ఓబుళమ్మ తన బంగారు నగలు ఇవ్వాల్సిందే అంటూ కృష్ణమూర్తిపై ఒత్తిడి చేసింది. తాకట్టు పెట్టిన బంగారు నగలను ఇవ్వలేని కృష్ణమూర్తి వృద్ధురాలిని వదిలించుకుంటే ఈ సమస్య తీరుతుందని భావించాడు. ఇందులో భాగంగా ఏకంగా ఆమెను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇదే విషయాన్ని తన కుమారులు బీరే భరత్, బీరే లోకనాథ్, భార్య బీరే లక్ష్మీదేవికి చెప్పాడు. అందరూ కూడగలుపుకుని వృద్ధురాలిని హత్య చేసేలా పతకం పన్నారు. ఇందులో భాగంగా బంగారు నగలను ఇస్తానని చెప్పి ఈ నెల 21వ తేదీ గురువారం నాడు ఓబుళమ్మను నమ్మించి తాను కౌలుకు చేస్తున్న వరి పొలం వద్దకు కృష్ణమూర్తి తీసకెళ్లాడు. ముందస్తుగా పతకం రచించిన మేరకు కుమారులతో కలిసి గొడ్డలితో నరికి ఓబుళమ్మను దారుణంగా హత్య చేశారు. అనంతరం అందరూ కలిసి మృతదేహాన్ని అత్యంత కిరాతకంగా ముక్కలుముక్కలుగా చేసి శరీర భాగాలను ఓ గోనె సంచిలో వేసుకుని ట్రాక్టర్లో పామిడి మండలం కోనేపల్లి దగ్గర పెన్నా నదిలో పారవేశారు. అనంతరం ఏమీ తెలియని వారిలా అందరూ గ్రామానికి వచ్చేశారు. ఓబుళమ్మ కనబడకపోవడంతో ఆమె మేనకోడలు శివలక్ష్మి గార్లదిన్నె పోలీస్ స్టేషన్లో గురువారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు మొదలు పెట్టారు. వృద్ధురాలిని వెతికే క్రమంలో కృష్ణమూర్తి పోలీసులు, గ్రామస్తులతో కలిసి తిరిగాడు. ఫిర్యాదు చేసే సమయంలో కూడా అతను పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఏమీ తెలియని వాడిలా నటించాడు. గురువారం రాత్రి గ్రామంలోని కొందరు

ఓబుళమ్మ శరీర భాగాలు

ఓబుళమ్మను కృష్ణమూర్తి ద్విచక్రవాహనంలో ఎక్కించుకని వెళ్లాడని ఆమె తమ్ముడు శివశంకర్‌రెడ్డికి తెలిపారు. దీంతో ఆయన అనుమానం వచ్చి పోలీసులకు ఈ సమాచారం తెలియజేశాడు. వెంటనే పోలీసులు కృష్ణమూర్తిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. దీంతో కృష్ణమూర్తి తానే హత్య చేసి మృతదేహం విడిభాగాలను పెన్నానదిలో పడవేశానని పోలీసుల ఎదుట అంగీకరించాడు. ఈ మాట విని నిర్ఘాంతపోయిన పోలీసులు నిందితున్ని శుక్రవారం ఉదయం పెన్నానది వద్దకు తీసుకెళ్లి వృద్ధురాలి శరీర భాగాలను బయటకు తీయించారు. హత్య చేసిన కృష్ణమూర్తితో పాటు సహకరించిన అతని ఇద్దరు కుమారులు, భార్యపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

వైసిపితో సంక్షేమ పాలన

అనంతపురం : సిఎం జగన్‌తోనే సంక్షేమ పాలన సాధ్యమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని 47వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైసీపీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. రానున్న ఎన్నికల్లో కూడా వైసిపికి ఓటు వేసి గెలిపిస్తే సంక్షేమ పథకాలన్నీ కొనసాగుతాయని తెలిపారు. కావున మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు.

సిఎం జగన్‌తోనే గ్రామాల అభివృద్ధి

వైసిపి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వై.విశ్వేశ్వర్‌రెడ్డి, శంకరనారాయణ

ప్రజాశక్తి-బెలుగుప్ప

వైసీపీ ప్రభుత్వం వచ్చాక ప్రతి గ్రామంలో అభివృద్ధి చేసి చూపించిన ఘనత సిఎం జగన్‌కే దక్కిందని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రామసాగరం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా గ్రామ సమీపంలో వెలసిన బుదిగుమ్మ సంజీవరాయుడు, వెంకటరమణ స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీ అధికారంలోకి వచ్చాక ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. ఒక్క రామసాగరం గ్రామానికే రూ.16 కోట్ల సంక్షేమ పథకాలు అందించామన్నారు. దీనికితోడు జీడిపల్లి రిజర్వాయర్‌కు కృష్ణాజలాలను తీసుకొచ్చిన ఘనత దివంగత సిఎం వైఎస్ఆర్‌కే దక్కిందన్నారు. ఆయన కొడుకుగా జగన్ ఎక్కువగానే చేశారన్నారు. కావున రానున్న ఎన్నికల్లో వైసిపికి ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దన్న, జడ్పిటిసి మమత త్రిలోకనాథరెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు చిన్న మచ్చన్న, వాల్మీకి సంఘం రాష్ట్ర డైరెక్టర్ రామాంజనేయులు, మాజీ కన్వీనర్ శ్రీనివాసులు, డైరెక్టర్లు బి.శివలింగప్ప, జి.శ్రీనివాసులు, సర్పంచి వెంకటలక్ష్మమ్మ, కేశవరెడ్డి, గోవింద్‌రెడ్డి, తిమ్మారెడ్డి, నాగిరెడ్డి, కరుణాకర్ బాబురెడ్డి, సర్పంచులు రామిరెడ్డి, రమేష్, రుద్రానంద, అనిల్, ఎంపిటిసి ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు స్వాగతం పలుకుతున్న మహిళలు

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టిడిపి నాయకులు

అరాచక ప్రభుత్వాన్ని సాగనంపుదాం

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల

ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న వైసిపి అరాచక పాలనను ఇంటికి సాగనంపుదామని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లి, కొరివిపల్లి, అలంకరాయినిపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపిస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వల్ల అన్నివర్గాల ప్రజలూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా ధరలు పెరిగి, వివిధ రకాల పనుల బాధుడుతో పేద, మధ్య తరగతి ప్రజలు జీవించలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ సమయంలో రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, మాజీ జడ్పిటిసి శాలిని దొర, సీనియర్ నాయకులు మారుతీనాయుడు, చిదానందనాయుడు, చితంబరిదొర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల అక్రమ వాడకంపై దాడులు

అనంతపురం : అనంతపురం ప్రాంతీయ నిఘా, అమలు అధికారి ఎస్ మాసూమ్‌బాషా ఆదేశాల జిల్లాలోని కళ్యాణదుర్గంలోని రాయదుర్గం రోడ్డు పక్కన ఉన్న తుపాకుల రామమూర్తి హోటల్‌లో శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఇంట్లో వాడాల్సిన గ్యాస్ సిలిండర్ల అక్రమంగా వాణిజ్య అవసరాలకు ఉపయోగించడాన్ని గుర్తించి జరిమానా విధించినట్లు తెలిపారు. అంతేగాకుండా ఐదు సిలిండర్లను స్వాధీనం చేసుకుని హోటల్ యజమాని బోయ పాలాక్షిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు పి.ఫణీంద్రనాథ్‌రెడ్డి, వాసుప్రకాష్, సుబ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

ఓబుళాపురం చెక్‌పోస్ట్ తనిఖీ

డి.హీరేహాళ్ : మండలంలోని ఓబుళాపురం గ్రామ సమీపంలో ఉన్న చెక్ పోస్ట్ వద్ద శుక్రవారం సబ్ డిప్యూటీ కమిషనర్ తనిఖీలు చేపట్టారు. ఆయన చెక్ పోస్టు సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.

మహారాజశ్రీ గుత్తి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో,
S.O.P. NO:4/2024
Between:
తలారి తిప్పన్న S/o వెంకటపతి, D.No:2-35, చిన్నపప్పూరు, పెద్దపప్పూరు మండలం, అనంతపురం జిల్లా. ...అర్జీదారుడు
V/S
Nil... ...రెస్పాండెంట్లు
ప్రకటన
అర్జీదారుడు, తాను చనిపోయిన పప్పూరు వెంకటపతి కుమారుడు పప్పూరు నారాయణకు ఏకైక వారసుడనియు అందువల్ల పప్పూరు నారాయణ మరణాంతరము అతని వారసులకు L.I.C. ఇండియా, తాడిపత్రి శాఖ వారు చెల్లించవలసిన మొత్తమును పొందుటకు వీలుగా అతని పేరిట SUCCESSION CERTIFICATE మంజూరు చేయవలసినదిగా పై కోర్టు నందు అర్జీ దాఖలు చేసియున్నారు. అందులకు ఎవరికైననూ ఆక్షేపణలున్న యెడల పై కోర్టు నందు 18/04/2024 వ తేదిన ఉదయం 10:30 గం॥లకు స్వయంగా కానీ వకీలు ద్వారా కానీ హాజరు కావలెను. లేని యెడల సదరు అర్జీని కోర్టువారు విచారించి తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
జి.శ్రీకాంత్ రెడ్డి, వకీలు, గుత్తి.

మహారాజశ్రీ గుత్తి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో,
S.O.P. NO:02/2024
Between:
ఎన్.నాగమ్మ W/o వెంకట బాలయ్య, D.No:14-275, గుత్తి, R.S., అనంతపురం జిల్లా. ...అర్జీదారుడు
V/S
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గుత్తి వారి తరుపున వారి మేనేజరు ...రెస్పాండెంటు
ప్రకటన
అర్జీదారుడు, తాను మరణించిన తన అన్న అయిన గుత్తి R.S. గ్రామస్థుడు ఎన్.ఓబన్న కుమారుడు నాగన్నకు ఏకైక వారసుడనియూ, సదరి నాగన్న తన జీవిత కాలములో గుత్తి R.S. పట్టణములోని అప్పటి ఆంధ్ర బ్యాంకులోని తన S.B.No: 017010011004432 లో నిలువ వుంచిన మొత్తమును పొందుటకు వీలుగా తన పేరిట SUCCESSION CERTIFICATE మంజూరు చేయవలసినదిగా పై కోర్టు నందు ఒక అర్జీ దాఖలు చేసియున్నారు. అందులకు ఎవరికైననూ ఎలాంటి ఆక్షేపణలున్ననూ 18/04/2024 వ తేదిన ఉదయం 10:30 గం॥లకు పై కోర్టు నందు స్వయంగా కానీ వకీలు ద్వారా కానీ హాజరు కావలెను. లేని యెడల సదరు అర్జీని కోర్టువారు విచారించి తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
జి.శ్రీకాంత్ రెడ్డి, వకీలు, గుత్తి.

In The Court of The Addl. Senior Civil Judge, Ananthapuramu
O.S.NO:111/2023
Between:
Malapati Chandana ...Plaintiff
And
The District Collector, Ananthapuramu and others ...Defendants
Notice To Defenndant No:5
D5: B.Nanji Reddy S/o Late B.Rami Reddy, Near TTD Kalyana Mandapam, Rapthadu Village and Mandal
పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 15-04-2024వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
బండారు విశ్వనాథ్, అడ్వకేట్
రాంనగర్, అనంతపురం. సెల్:9441012298

ప్రకటన
ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా కక్షిదారుడు దేశినేని రాజేంద్ర నాయుడు తండ్రి:లేట్ దేశినేని వెంకటరాముడు, డోర్ నెం:6-5-694-1, శ్రీనగర్ కాలనీ, అనంతపురం వారు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పూల వెంకట లక్ష్మమ్మ భర్త:లేట్ పి.శివారెడ్డి, 3వ రోడ్డు, అనంతపురం మరియు ఇతరులతో విక్రయ రిజిష్టర్ చేసుకొన్నారు. అయితే నా క్లయింటుకు సంబంధించిన ఒరిజినల రిజిష్టర్ డాక్యుమెంటు నెం:2436/2021 అనంతపురం పట్టనం రిజిష్టరు ఆఫీసు దగ్గర పోగొట్టుకొని పోయినిది. ఈ విషయము అనంతపురం 4వ పట్టణ పోలీసు స్టేషను నందు ఫిర్యాదు చేయడము జరిగినదని చెప్పినారు. ఈ క్రింది షెడ్యూలు దాఖల ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ పత్రము 2436/2021 ఎవరికైన దొరికినచో లేదా ఈ ఆస్తికి సంబంధించిన ఏమైన ఆక్షేపణలున్నచో వెంటనే నాకు గాని నా కక్షిదారుడుకు గాని 10 రోజుల లోపల తెలియజేయ గలరు.
షెడ్యూలు
అనంతపురం రి॥డి॥ అనంతపురం రూరల్ సబ్॥డి॥కి చేరిన కామారుపల్లి గ్రామ పొలం సదరు పంచాయితీ ఏరియాలోని ఆస్తి వివరం

బాబు వివరం	సర్వే నెం.	ఎ.సి.	ఎ.సి
సర్కారు ఖుష్కి	68	11-76 పైకి	5.88
సర్కారు ఖుష్కి	68	11-76 పైకి	5.88
			11-76

H.S:4,762, ఖాతా నెంబర్లు:318,319
చెక్కుబంది:తూర్పు:పుల్లప్ప గారి లక్ష్మీనారాయణ గారి జమీను **దక్షిణం:**హరినాథ్ రెడ్డి గారి జమీను, **పడమర:**సిద్దప్ప గారి ఎర్రిస్వామి జమీను, **ఉత్తరం:**పల్లెల్లి నాగిరెడ్డి గారి జమీను.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
బండారు విశ్వనాథ్, అడ్వకేట్
రాంనగర్, అనంతపురం. సెల్:9441012298

In The Court of The Hon'ble 1st Addl. Junior Civil Judge-Cum-Addl. J.F.C.M.Ananthapuramu
O.S. NO:1353/2022
Between:
Mendraguthy Nagalakshmi, W/o M.Gangulaiah, Residing at D.No:7/5/180, N.T.R.Colony, Near T.V.Tower ...Plaintiff
And
P.Hasina ...Defendant
Notice To Defenndant
P.Hasina W/o Hindhar Vali, Residing at D.No:7/4/148, N.T.R.Colony, Near T.V.Tower Ananthapuramu Dist.
ఇందుమూలముగా మీకు తెలియజేయడము ఏమనగా Defendant హాజరు నిమిత్తము 11-04-2024వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు అని తెలుపడమైనది.
(By court order)
బి.నారాయణ స్వామి,
వాదితరుపు వకీలు, అనంతపురం.

అనంత రిలయన్స్ మార్ట్ దోపిడీకి కుట్ర

ముగ్గురు నిందితులను పట్టుకున్న పోలీసులు-మారణాయుధాలు స్వాధీనం

స్వాధీనం చేసుకున్న మారణాయుధాలను చూపుతూ నిందితుల వివరాలను మీడియాకు తెలియజేస్తున్న ఎస్పీ అన్బురాజన్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

అనంతపురం జిల్లా కేంద్రంలోని రిలయన్స్ మార్ట్‌లో దోపిడీకి కుట్ర పన్నిన ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం నాడు అనంతపురం పోలీసు కాన్ఫరెన్స్ హాల్లో మీడియాకు ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్ తెలియజేశారు. బుక్కరాయసముద్రం మండలం రేకులకుంట గ్రామానికి చెందిన గుజ్జల రుశ్యింగులు, అనంతపురం హమాలీ కాలనీకి చెందిన రాగిరి శ్రీనివాసులు, శెట్టూరు మండలం ఐదుకల్లు గ్రామానికి చెందిన గొల్ల చంటిలు ఒక ముఠాగా ఏర్పడ్డారు. వీరిలో గుజ్జల రుశ్యింగులు గతంలో గుజరి, సిల్వర్ సామాన్ల వ్యాపారం చేసేవాడు. ఆ వ్యాపారంలో సుమారు రూ.7 లక్షల వరకు అప్పులు అయ్యాయి. ఆ అప్పులు తీర్చేందుకు తనకు దూరపు బంధువు అయిన అనంతపురం రిలయన్స్ మార్ట్‌లో పనిచేసే రాగిరి శ్రీనివాసులు, శెట్టూరు మండలం ఐదుకల్లు గ్రామానికి చెందిన చంటీలను సంప్రదించాడు. వీరంతా అనంతపురం బస్టాండ్ వెనుకవైపు ఉన్న రిలయన్స్ మార్ట్‌లో దోపిడీ చేయాలని పథకం రచించారు. రిలయన్స్ మార్ట్ నుంచి రోజూ సుమారు రూ.25 నుంచి రూ.30 లక్షల నగదును మేనేజర్ బ్యాంకుకు తీసుకెళ్తున్న విషయాన్ని గుర్తించారు. డబ్బు తీసుకెళ్లే సమయంలో మేనేజర్‌ను అడ్డగించి దోపిడీ చేయాలనుకున్నారు. ఇందుకు కోసం రెక్కీ కూడా నిర్వహించారు. ఈ దోపిడీతో పాటు అనంతపురం హౌసింగ్ బోర్డులోని ఓ వర్తక వ్యాపారి ఇంట్లో కూడా దోపిడీ చేసేందుకు పథకం వేశారు. దోపిడీ చేయాలనుకునే ఇంట్లో ఓ వృద్ధురాలు, కూతురు, బాలుడు మాత్రమే ఉంటారని తెలుసుకుని అక్కడ సులువుగా దోపిడీ చేయొచ్చని భావించారు. దోపిడీ చేసే క్రమంలో అడ్డువస్తే వారందరినీ చంపడానికి కూడా సిద్ధ పడ్డారు. దొంగతనాలు, దోపిడీల నియంత్రణపై ప్రత్యేక నిఘా ఉంచిన పోలీసులకు జిల్లా స్పెషల్ బ్రాంచి నుంచి దోపిడీ ముఠా సమాచారం అందింది. దీనిపై స్పందించి ఎస్పీ అన్బురాజన్ నిందితులను పట్టుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో డీఎస్పీ జి.వీరరాఘవ రెడ్డి పర్యవేక్షణలో అనంతపురం వన్‌టౌన్ సిఐ రెడ్డప్ప, సిబ్బందితో ప్రత్యేక బందాలుగా ఏర్పడి నిఘా వేశారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం అందిన సమాచారం మేరకు అనంతపురం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సర్కిల్ వద్ద నిందితులు ముగ్గురిని అరెస్టు చేశారు. వారి నుంచి మూడు వేటకొడవండ్లు, ఐరన్ రాడ్, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు. జిల్లాలో ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తుంటే డయల్-100, లేదా తన ఫోన్ నెంబర్ 9440796800కు సమాచారం చేర వేయాలని ఎస్పీ కోరారు.

నేరాలు ఘోరాలు

కర్నాటక మద్యం పట్టివేత

గుత్తి : గుత్తి ఆర్ఎస్‌లోని చెర్లోపల్లి రోడ్డులో కర్ణాటక మద్యం విక్రేతలను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఓ.నబీరసూల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. స్పెషల్ బ్రాంచి హెడ్‌కానిస్టేబుల్ నాగేంద్రకు వచ్చిన సమాచారంతో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించడంతోపాటు వారి వద్ద ఉన్న బ్యాగును పరిశీలించగా కర్ణాటకకు చెందిన 702 టెట్రా పాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన ఎరుకల సుజాత, ఎరుకల నాగేంద్రను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరు బెంగళూరులోని మద్యం షాపుల్లో టెట్రా పాకెట్లను కొనుగోలు చేసి రైలులో గుత్తికి వచ్చి ఇక్కడ నుంచి పత్తికొండకు తీసుకెళ్లి విక్రయించేవారన్నారు. వీరితోపాటు టీవీఎస్ స్కూటీని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితులను కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఆశాబేగం, స్పెషల్ బ్రాంచి హెడ్ కానిస్టేబుల్ జి.నాగేంద్ర, కానిస్టేబుళ్లు, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల పరిధిలోని దుద్దేకుంట గ్రామంలో కర్నాటక మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి హరిజన చెన్నప్పను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో కర్నాటక మద్యం తీసుకొచ్చి అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో నిందితుడిని అదుపులోకి తీసుకోవడంతోపాటు 90 మద్యం బాటిళ్లు, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జూదరులు అరెస్టు

పుట్లూరు : మండల పరిధిలోని ఎల్లుట్ల గ్రామంలో ఉన్న శ్మశానం వద్ద జూదం ఆడుతున్నారన్న సమాచారం రావడంతో దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రూ.3,080 నగదు, 52 పేకముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

డి.హీరేహాళ్ : మండలంలోని పాత హడగలి గ్రామ సమీపంలో శుక్రవారం పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 11 వేల నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

తాడిపత్రి రూరల్ : మండలంలోని గంగాదేవిపల్లికి చెందిన ప్రసాద్‌పై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. రెండు రోజుల క్రితం పుట్లూరు మండలం జీసీ పల్లికి చెందిన ఎక్స్‌వేటర్ ఆపరేటర్ పెద్దిరాజును పనికి రావాలంటూ ప్రసాద్ పిలిచాడు. తాను రాలేనని చెప్పడంతో ఆగ్రహానికి గురైన ప్రసాద్, పెద్దిరాజుపై దాడిచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ప్రసాద్ పై కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

నీటి సంరక్షణపై అవగాహన

పివికెకెలో నీటి సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనంతపురం

పపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగర సమీపంలోని పివికెకె కళాశాలలోనిసెమినార్ హాలులో స్టూడెంట్ యాక్టివిటీ సెల్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులకు నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి.రమేష్‌బాబు, ఎ.ఓ కె.మనోహర్‌రెడ్డి నీటి సంరక్షణపై వివరించారు. మనిషి దైనందిన జీవితంలో నీటి పొదుపు పద్ధతులను అనుసరించేలా విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఆనంద్ దంపెల్ల, కో-కన్వీనర్ మనోజ్ కలిసి విద్యార్థులతో క్యాంపస్ అంతటా సైలెంట్ మార్చ్ నిర్వహించారు.

కళ్యాణదుర్గం : ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పట్టాలని సీనియర్ ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. శుక్రవారం కందుకూరు మండలంలోని ములుగు గ్రామంలో నీటి పొదుపు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం నీటిని వృథా చేయకుండా ప్రతి నీటి బొట్టునూ నిల్వ చేసుకోవాలన్నారు. అదేవిధంగా రైతులు పొలాల్లో నీటికుంటలు, చెక్‌డ్యాంలు నిర్మించుకుని భూగర్భజలాలను పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయకుమార్, హనుమంతురెడ్డి, జయలక్ష్మి, కళ్యాణి, సురేష్‌బాబు, శివానంద, శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : నీటి సంరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ నీటిని సంరక్షించు కునేందుకు ముందడుగు వేయాలని రాయదుర్గం రైతు రక్షణ వేదిక వ్యవస్థాపకులు, న్యాయవాది గౌని ప్రతాపరెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది (ప్రస్తుత వేసవిలో) ఎప్పుడూ లేనంతగా ఉష్ణోగ్రతలు నమోదవ డానికి భూగర్భ జలాలు అడుగంటిపోవడమే ప్రధాన కారణంగా పేర్కొన్నారు. నీటి సంరక్షణ బాధ్యతను ప్రతిఒక్కరూ తీసుకోవాలి, సాగునీటి సాధన కోసం పోరాటం చేయాలని గౌని ప్రతాప్‌రెడ్డి ప్రకటనలో కోరారు.

బొమ్మనహాల్ : మండలంలోని గోనేహాల్, శ్రీధరఘట్ట గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి పంటను శుక్రవారం డిడిఎ మద్దిలేటి, ఎడిఎ శైలజ పరిశీలించారు. అలాగే వ్యవసాయ సిబ్బంది, రైతులతో సమీక్ష నిర్వహిం చారు. డిడిఎ మద్దిలేటి వరి పంటలో వేసవిలో వచ్చే చీడ పీడలు, కాండం తొలుచు పురుగు, తదితర వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు పాటించాల్సిన సస్యరక్షణ, నివారణ చర్యలను అర్థమయ్యేలా వివరించారు. ప్రయివేటు దుకాణదారుల సూచనలు, సలహాలు పాటిస్తే నష్టపోతారని సూచించారు. వారితో పాటు మండల వ్యవసాయ అధికారి సాయికుమార్, శ్రీనివాసులు, ఆర్‌బికె సిబ్బంది, రైతులు ఉన్నారు.

వైసిపికి ఓటేస్తే మళ్లీ రౌడీరాజ్యమే..

ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు

ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-నార్పల

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి ఓటు వేస్తే మళ్లీ రౌడీరాజ్యమే అధికారంలోకి వచ్చి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని నరసాపురం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా గ్రామంలోని పెద్దమ్మ, సీతారాములస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఒక్కఛాన్స్ పేరుతో వైసిపి ఒకసారి అధికారంలోకి రావడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. రాష్ట్రం సర్వనాశనం అయిందన్నారు. మరోసారి అధికారంలోకి వస్తే ఇక అరాచకంతోపాటు అంధకారమే అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి రాలేమని వైసిపి అప్పుడే రాష్ట్రంలో హత్యలు, దాడులకు పాల్పడుతోందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుంపటిగా మార్చారన్నారు. కేవలం భవనాలను రంగులు వేసుకోవడం తప్ప చేసిందేమీ లేదన్నారు. కావున రానున్న ఎన్నికల్లో టిడిపి ఓటు వేసి నియోజకవర్గంలో బండారు శ్రావణిశ్రీని ఎమ్మెల్యేగా, చంద్రబాబును సిఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కాగా పలువురు వైసిపి నుంచి టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా టిడిపిలో చేరిన మాజీ వైస్‌సర్పంచి సుశీలమ్మ, వైసిపి నాయకులు సీవీ గోపాల్‌రెడ్డి, లింగారెడ్డితోపాటు పలువురికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆకుల ఆంజనేయులు, పిట్టు రంగారెడ్డి, రాము, ఎర్రినాగప్ప, లక్ష్మీనాయుడు, శుభోష్, ముత్తినేని సూరి, భక్తవత్సల్, రవినాయుడు, ప్రకాష్, నగేష్, సత్తి, బాలు, విక్రమ్, చంద్రబాబు, ఆదినారాయణ, శ్రీనా, ప్రతాప్, ప్రభాస్, ప్రశాంత్, కొండల నాయుడు, విజయభాస్కర్, శరత్, సూరి, వెంకటేష్, నారాయణస్వామి, రమేష్, టీడీపీ, జనసేన, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ప్రజాశక్తి-నార్పల

ఎన్నికల నిబంధనలు ఎవరు ఉల్లంఘించినా చర్యలు తప్పవని ఎంపిడిఒ రాముడు హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను పంచాయతీ కార్యదర్శులు పరిశీలించి మౌలిక వసతులపై ఆరాతీయాలన్నారు. ముఖ్యంగా పోలింగ్ కేంద్రాల్లో మరుగుదొడ్లు, తలుపులు, కిటికీలు అన్ని సక్రమంగా ఉన్నాయా.. లేదా.. అని పరిశీలించాలన్నారు. అదేవిధంగా ఫీల్డ్ అసిస్టెంట్లు, వాలంటీర్లు, కాంట్రాక్టు ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే తక్షణ చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు సమాచారం అందజేయాలన్నారు. అలాగే ఎక్కడైనా ప్రభుత్వ ప్రచార చిత్రాలు, ప్రజాపతినిధుల ఫొటోలు ఉంటే తొలగించాలన్నారు. విగ్రహాలకు ముసుగులు వేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మండల విస్తరణ అధికారి శైలజారాణి, సెక్టోరియల్ ఆఫీసర్ ఉమాదేవి, అన్ని పంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలు చేయాలని రిటర్నింగ్ అధికారిణి రాణీసుస్మిత సూచించారు. శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నోడల్ అధికారులకు కేటాయించిన రూట్లో వాహనాలను తనిఖీ చేసి ఎప్పటికప్పుడు జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం అందించాలన్నారు. రాజకీయ పార్టీలు కోర్టు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయాలు, చర్చిలు, పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించరాదన్నారు. అభ్యర్థులు కులమతాలను రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు ఉండరాదన్నారు. ఈ సమావేశంలో 5 మండలాల నోడల్ అధికారులు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : ప్రభుత్వం నుంచి వేతనం పొందుతూ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు తప్పవని ఎంపి డిఒ అల్లాబకాష్ హెచ్చరించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికా రులతో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో వాలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు తెలిస్తే విధుల నుంచి తొలగి స్తామన్నారు. గ్రామాల్లో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, స్టిక్కర్లు, పార్టీల జెండాలు ఉంటే తొలగించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి పని చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో వ్యవసాయ, ఉపాధి హామీ , ఆర్డబ్ల్యూఎస్, ఐసిడిఎస్, వైకెపి, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు డిఆర్, అరియర్స్ చెల్లించాలి

గుత్తి : పెన్షనర్లకు 11వ పిఆర్‌సి, అరియర్స్, 2018 నుంచి రావాల్సిన డిఆర్ అరియర్స్‌ను చెల్లించాలని ఎపి పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దన్నగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎన్‌జిఒ తాలూకా కార్యాలయంలో పెన్షనర్ల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. అనంతరం పెద్దన్నగౌడ్‌ను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ తాలూకా అధ్యక్షులు కె.అబూబకర్, అదనపు కార్యదర్శి జన్నే కుళ్లాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య ప్రదర్శనకు గేట్స్ విద్యార్థుల ఎంపిక

గుత్తి : దేశంలోనే అతిపెద్ద నైపుణ్య ప్రదర్శన ఇండియా స్కిల్స్ కాంపిటీషన్ 2024కు గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 19న గుంటూరు, విజయవాడ నగరాల్లో ప్రీస్టేట్ పోటీల పేరుతో కార్యక్రమాలు నిర్వహించారు. పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు పాల్గొన్నాయి. అందులో గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న ఇసిఇ, ఇఇఇ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాల్లోని విజయ్ కుమార్, వీరేష్ బాబు, రోహిత్ కుమార్, సర్వాణి, బాబా ఫక్రుద్దీన్, మాధుర్య హాజరై ఎలక్ట్రానిక్స్ క్లౌడ్ కంప్యూటింగ్, గ్రాఫిక్ డిజైన్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్, ఫ్యాషన్ టెక్నాలజీ విభాగాల్లో తమ ప్రతిభను చాటారు. మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్ప్రినియర్షిప్ అనుబంధ సంస్థ నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. త్వరలో ఫ్రాన్స్ దేశంలో జరగబోయే ప్రపంచ స్థాయి పోటీల్లో 86 దేశాలు పాల్గొననున్నాయి. అందులో భారత దేశంలోని ప్రతిభ గల యువత దేశ ఖ్యాతిని పెంచేందుకే ప్రదర్శన ప్రధాన ఉద్దేశం అని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం తెలిపారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

గార్లదిన్నె : మహిళలు పోషకాలు ఉన్న ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని అంగన్వాడీ సూపర్‌వైజర్ జ్యోతి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని సిరివరం గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో కల్లూరు సెక్టార్ పరిధిలోని పోషక పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, మహిళా పోలీసు శ్రీలక్ష్మి మాట్లాడుతూ చిన్నపిల్లలు, గర్భిణులు, కిషోర్ బాలికలు, మహిళలు మంచి పోషకాహారాన్ని తీసుకున్నప్పుడే మెరుగైన ఆరోగ్యం పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు జయలక్ష్మి, ఒలేశ్వరమ్మ, సువర్ణ, మాలతి, లక్ష్మి, సౌభాగ్య, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీగా బాలాజీనాయక్

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీగా శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గం అమరాపురం మండలం, బసవనపల్లి పంచాయతీ ఆరోవనహళ్లి గ్రామానికి చెందిన బాలాజీనాయక్ నియమితులయ్యారు. శుక్రవారం ఈ మేరకు నియామకపత్రాన్ని అందుకున్న బాలాజీ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేసిన సేవను గుర్తించి అధిష్ఠానం తనకు రాష్ట్ర యూత్ కమిటీలో చోటు కల్పించినందుకు రాష్ట్ర నాయకత్వానికి, నియోజకవర్గం నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు సమిష్టిగా పని చేస్తామన్నారు. ప్రత్యేకంగా పీసీసీ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డికి, మాజీ పీసీసీ అధ్యక్షులు ఎన్.రఘువీరారెడి, మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి సుధాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడాకారులు గెలుపే ధ్యేయంగా ముందుకెళ్లాలి

ఉరవకొండ : క్రీడాకారులు గెలుపే ధ్యేయంగా దృఢ సంకల్పంతో ముందుకెళ్లాలని సెపక్‌తక్రా క్రీడాసంఘం జిల్లా అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున పిలుపునిచ్చారు. శుక్రవారం ఉరవకొండలోని పోలీసు మైదానంలో ఆంధ్రప్రదేశ్ సెపక్‌తక్రా జూనియర్ బాల, బాలికలకు, సబ్ జూనియర్ బాల, బాలికలకు ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని మల్లికార్జున ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత నెల నెల్లూరులో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ సెపక్‌తక్రా జూనియర్, సబ్ జూనియర్ బాల, బాలికల జట్లు రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్లకు ఎంపికైనట్లు వివరించారు. ఎంపికైన 50 మంది క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడానికి అంతర్జాతీయ క్రీడాకారులైన కర్నూలు జిల్లా అశోక్, శివ, ప్రకాశం జిల్లా మధు, సెపక్ తక్రా కోచ్ శ్రీనివాసులు ఈనెల 25 వరకూ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సెపక్ తక్రా జనరల్ సెక్రటరీ జి.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణంపై చర్చ

నార్పల : మండల పరిధిలోని పప్పూరు గ్రామంలో ఆలయ నిర్మాణంపై తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ రాముడు, విస్తరణ అధికారిణి శైలజారాణి శుక్రవారం స్థానికులతో చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున గ్రామంలో ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించి అనుమతి తీసుకోవాలని కోరారు. నియోజకవర్గ ఎన్నికల అధికారిని సంప్రదించి అనుమతి తీసుకున్న తర్వాతనే ఆలయ మరమ్మతులు, పునర్నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. ఇందుకు స్థానికులు స్పందిస్తూ అధికారుల సూచనల మేరకే ముందుకు వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనరసింహులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'మయూరి' టైల్స్, శానిటరీ షోరూం ప్రారంభం



ప్రజాశక్తి-అనంతపురం

బళ్లారి రోడ్డు సాయిబాబా ఆలయం సమీపంలో నూతనంగా నిర్మించిన మయూరి టైల్స్ అండ్ శానిటరీ షోరూంను శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధినేత వై.రంగస్వామి మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం తమ రెండవ బ్రాంచ్‌ను బళ్లారి రోడ్డులో అధునాతన హంగులతో సొంత భవనంలో అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు తెలిపారు. 12 సంవత్సరాలుగా ప్రజల ఆదరణతో ముందుకు నడుస్తున్న తాము రెండవ బ్రాంచిని ప్రారంభించడం సంతోషకరంగా ఉందన్నారు. నూతన బ్రాంచ్‌లో సరికొత్త మోడల్స్ టైల్స్, శానిటరీ వస్తువులను అందుబాటులో ఉంచామన్నారు. తమ వద్ద క్యూ టోన్, సింపులో, కెరోవిట్, సెర, ఎల్‌వి,కలర్ టైల్ కంపెనీల టైల్స్ శానిటరీ వేర్ వస్తువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో క్యూ టోన్ సిరామిక్ ప్రయివేటు లిమిటెడ్ జనరల్ మేనేజర్ కృష్ణారెడ్డితో పాటు పలు ప్రముఖ టైల్స్ శానిటరీ వేర్ కంపెనీల ప్రతినిధులు, జిల్లాలోని ప్రముఖులు, అధికారులు వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం

శింగనమల : మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో పని చేస్తూ ఉద్యోగోన్నతిపై వెళ్తున్న పలువురు వైద్య సిబ్బందిని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పర్యవేక్షణ అధికారి డాక్టర్ చంద్రకళ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. జనరల్ సర్జన్ డాక్టర్ రమణానాయక్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, మత్తుమందు డాక్టర్ అజేంద్ర, జూనియర్ అసిస్టెంట్ అనిల్‌కుమార్ సీనియర్ అసిస్టెంట్‌గా, ఎఫ్ఎన్ఒ సావిత్రమ్మ ఓటి టెక్నీషియన్‌గా ఉద్యోగోన్నతిపై బదిలీ వెళ్తున్నారు. దీంతో వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, వైద్యులు ప్రవీణ్, జగదీష్, రమ్య, టిప్పు సుల్తాన్, హెడ్‌నర్స్ వరలక్ష్మి, ఫార్మాసిస్ట్ ఉమా, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ శివశంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

అనంతపురం : జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఎంఎస్ఎస్ 2వ యూనిట్ ఆధ్వర్యంలో రాప్తాడు మండలం రామనెపల్లి గ్రామంలో అనంతపురం కిమ్స్ సవీరా ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు ఎంఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.మమత తెలిపారు. ఈ సందర్భంగా సాధారణ ఆరోగ్య పరీక్షలు, రక్తపోటు పర్యవేక్షణ, రక్తంలో చక్కర స్థాయి పరీక్ష, 2డి 3డి ఎకో, ఈసిజి, రక్త వర్గీకరణ పరీక్షలు వైద్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ సవీరా ఆసుపత్రి వైద్యులు బాలకిశోర్, గుండె వైద్యులు రామప్రసాద్, జెఎన్‌టియు రిజిస్ట్రార్ సి.శశిధర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

పెద్దవడుగూరు : ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని చిత్రచేడు, చిట్టూరు, దిమ్మగుడి, చిన్నవడుగూరు గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలు శుక్రవారం కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా ట్రైనీ డీఎస్పీ హేమంత్ కుమార్, బిఎస్ఎఫ్ డీఎస్పీ సంతోష్‌భట్, పెద్దవడుగూరు ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రామాల్లోని ప్రధాన రహదారుల గుండా కవాతు నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కవాతు నిర్వహించినట్లు పోలీసులు సంకల్పించారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

ఉరవకొండ : ఈనెల 23న ఉరవకొండలో నిర్వహించనున్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు భారీగా తరలిరావాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు తమ్మన్న పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని కవితా సర్కిల్, పాత బస్టాండ్, గుంతకల్లు రోడ్డులో అంబేద్కర్ విగ్రహావిష్కరణకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం పట్టణంలోని 3వ వార్డు జోగప్ప బావి వీధిలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కావున కులాలకతీతంగా అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద ముష్టూరు ఓబయ్య, ఇంద్రావతి, సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నిరోధక చట్టంపై అవగాహన

ఉరవకొండ : మండల పరిధిలోని రాకెట్ల తండాలో లింగ నిర్ధారణ పరీక్షల నిరోధక చట్టంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి వెంకటేష్‌నాయక్ మాట్లాడుతూ రాకెట్ల ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈఏడాది కాన్పుల్లో మగపిల్లల సంఖ్య ఎక్కువ, ఆడపిల్లల సంఖ్య తక్కువగా నమోదైనట్లు వివరించారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో సామాజిక అసమాతుల్య పరిస్థితులు ఏర్పడి అనేక సమస్యలు ఎదురవుతాయని వివరించారు. కొంతమంది గర్భిణుల కుటుంబ సభ్యులు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఆడ బిడ్డ అయితే భ్రూణహత్యాలకు పాల్పడుతున్నారన్నారు. ఇది చట్టరీత్యా నేరమన్నారు. భ్రూణహత్యలకు పాల్పడితే రూ.లక్ష వరకూ జరిమానా, పదేళ్ల జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగ రంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ, హెల్త్ సూపర్‌వైజర్ శేఖర్, సిహెచ్ఒ నాగసురేఖ, ఏఎన్ఎం పద్మావతి, హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

'ది గ్లోబల్' స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ఉరవకొండ : అక్రమ అడ్మిషన్లకు పాల్పడుతున్న ది గ్లోబల్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, యుఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎ, ఆర్ఎస్‌యు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక తహశీల్దార్‌కు విద్యార్థి సంఘాల నాయకులు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాకమునుపే గ్లోబల్ స్కూల్ యాజమాన్యం ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతున్నా మండల విద్యాశాఖ అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నట్లు వ్యవహరిస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి సంబంధిత పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోతే రానున్న రోజుల్లో ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిద్ధార్థ, యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బ్రహ్మ, ఐసా జిల్లా సహాయ కార్యదర్శి రాజశేఖర్, ఆర్ఎస్‌యు జిల్లా అధ్యక్షుడు భీమేష్ పాల్గొన్నారు.

'పది' పరీక్షకు 87 మంది గైర్హాజరు

బెలుగుప్ప : మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన పదో తరగతి పరీక్షకు 87 మంది గైర్హాజరైనట్లు ఎంఇఒ మల్లారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని మూడు కేంద్రాలో పరీక్షలు జరుగుతుండగా 607 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 520 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.